క్లుప్తంగా

28న మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బెల్లంపల్లి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28న బెల్లంపల్లిలో మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షుడు జి.శ్రీహరి, కార్యదర్శి డీఆర్ శ్రీధర్, కోశాధికారి రంగ ప్రశాంత్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన కరపత్రాలను ఆవిష్కరించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదుట మహాత్మా జ్యోతిభాపూలే, సావిత్రి బాయి పూలే, పెరియార్ రామస్వామి, బీఆర్ అంబేడ్కర్ మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్ బాలబోయిన విజ్ఞాన దర్శిణి అధ్యక్షుడు రమేష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జ్యోతి కుమార్, కనకయ్య, కృష్ణ, రవి, చంద్రమౌళి, ఎల్తూరి శంకర్, రవిరాజ్, నారాయణ, రామస్వామి, సో కాల శ్రీనివాస్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధికారిని సంప్రదించాలి

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత పత్తి రైతులు పత్తి డబ్బుల చెల్లింపుల కోసం చెన్నూర్ కాటన్ మిల్ లో అందుబాటులో ఉండే పర్చేసింగ్ ఆఫీసర్‌ను సంప్రదించాలని చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. మార్కెట్ అధికారులు రైతులకు కేవలం తక్‌పట్టి మాత్రమే జారీ చేస్తుందని పేర్కొన్నారు. కాటన్ పర్చేసింగ్ అధికారి పత్తి కొనుగోలు చేసి, సీసీఐ ఆదిలాబాద్ శాఖకు ఆధార్ లింక్ చేయడంతో బ్యాంక్ ఖాతా ద్వారా రైతులకు డబ్బులు చెల్లింపు జరుగుతాయని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ కమిటీ అధికారులకు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చెన్నూర్: చెన్నూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయుర్వేదిక్ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయుర్వేద వైద్యులు లక్ష్మీరవళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి రోగుల నుంచి స్పందన లభించింది. వంద మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీరవళి మాట్లాడుతూ.. తన స్వగ్రామం చెన్నూర్ కావడంతో, చెన్నూర్ ప్రజలకు వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్బా బాస్కర్, ఎల్లాగౌడ్, రెబ్బెన నగేశ్, కొమ్మెర సత్యనారాయణ, సాకేత్, పూర్ణ చందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణ

నస్పూర్: పట్టణ పరిధిలోని న్యూనాగార్జున కాలనీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వీ సూర్యనారాయణ దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గండ దీపాల వెలిగింపు



చెన్నూర్‌లో...

దండేపల్లి/చెన్నూర్/భీమారం: మహాశివరాత్రి సందర్భంగా శివుడికి ఉపవాస దీక్షలు చేసే కొంతమంది భక్తులు బుధవారం రాత్రి ఇళ్ల ఎదుట రోకలిబండను భూమిలో పాతి, గండ దీపాన్ని వెలిగించారు. గండదీపం వెలిగింపుతో గండాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

'మద్దికల్'లో మల్లన్న పట్నాలు



భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో స్వయంభుగా వెలిసిన గట్టమల్లన్న ఆలయంలో మల్లికార్జున స్వామికి ఒగ్గుపూజారులు పట్నాలు వేశారు. అన్ని గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపావాస్యదీక్షతో ఉన్న భక్తులు చెన్నూరు వెళ్లి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఇంట్లోనే శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వివాహ తంతులో ఎమ్మెల్యే వినోద్ దంపతులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వినోద్ దంపతులు

బెల్లంపల్లి/తాండూర్: బెల్లంపల్లిలో గోవింద మాంబాదేవి సహిత శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, రమ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి వివాహ తంతు కార్యక్రమాన్ని తిలకించారు. పూర్ణాహుతి, హోమం చేశారు. ఉత్సవ మూర్తులను పుర వీధుల మీదుగా ఊరేగించి పల్లకి సేవ చేశారు. తాండూర్ మండలంలో శైవక్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. సన్యాసి మఠానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్-రమ దంపతులు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లక్సెట్టిపేటలో..



లక్సెట్టిపేట: మండల సమీపంలోని గోదావరి నదికి భక్తులు తరలివచ్చారు. సమీప సాంబశివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నస్పూర్ సీతారాంపల్లిలో...



నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి నదీ ఒడ్డున గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని న్యూ నాగార్జున కాలనీలోని శివాలయంలో భక్తులు పూజలు చేశారు.

శివ పార్వతుల కల్యాణం



చెన్నూర్: చెన్నూర్ శివాలయంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి నదీ తీరంలోని శైతకా లింగాలకు అభిషేకం చేశారు.



హెచ్చరించినా పట్టించుకోలే..



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్ల పుష్కర ఘాట్ పరిసరాలకు, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పరిసరాలకు గోదావరి పుణ్యస్నానాలకు రావొద్దని పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేసినా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంచిర్యాల సమీపంలోని గోదావరి నదిలో స్నానం ఆచరిస్తున్న భక్తులు



ఓం నమః శివాయ..!

• అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం • ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు • బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

జిల్లా వ్యాప్తంగా బుధవారం మహాశివరాత్రి వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తుల కోలాహలం మధ్య శివపార్వతుల కల్యాణం జరిపించారు. అభిషేకం, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఓం నమః శివాయ.. హరహర మహా దేవ.. శంభోశంకర అంటూ ఆలయ ప్రాంగణాలు, గోదావరి తీరం శివ నామస్మరణతో మారుమోగాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

'కత్తెరసాల'లో కిక్కిరిసిన భక్తులు



ఉత్సవ విగ్రహాలు తీసుకొస్తున్న తహసీల్దార్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మల్లికార్జునస్వామి, భ్రమరాంభిక దేవి కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గణపతి పూజ, అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామి వారికి, అమ్మ వారికి పట్టు వస్త్రాలు ధరింపజేసి మేళతాళాలు, వేద మంత్రాల మధ్య కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ దంపతులు, తహసీల్దార్ మల్లికార్జున్ దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో సేవలందించారు.



ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే వివేక్ దంపతులు

'బుగ్గ'లో భక్తజన సంద్రం



స్వామి దర్శనం కోసం క్యూ లైన్లలో భక్తులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ఆలయ పూజారులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతినిచ్చారు. భక్తులు కోనేటిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. బుగ్గ, లింగాపూర్‌లోని శ్రీ లింగేశ్వరస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్-రమ దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యుడు ఆర్.ప్రవీణ్, అధికారులు, నాయకులు పూజలు చేశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తాగు నీరు, మజ్జిగ, అల్పాహారం, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నె ల, భీమిని, కన్నెపల్లి మండలాలతో పాటు మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య ఎదురైంది. నూతన బీటీ రోడ్డు సైడ్ రేలింగ్ పనులు చేపట్టకపోవడంతో రోడ్డు ఇరుకగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. పోలీసులు వాహనాలను దారి మళ్లించడంతో కొంతమేర ట్రాఫిక్ సమస్య తీరింది.



కోనేటిలో భక్తుల తాకిడి



నెన్నెల: పూజలు చేస్తున్న మహిళలు



వేమనపల్లి: ఇసుక లింగానికి పూజలు చేస్తున్న భక్తులు



కోటపల్లి మండలం పార్‌పల్లి వద్ద..



జన్నారం బాదంపల్లి గోదావరి రేవులో...

జిల్లా కేంద్రం..జనసందోహం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మంచిర్యాల గోదావరి నదికి పుణ్యస్నానం చేయటానికి భక్తులు తరలిరావడంతో కిలోన్నర మీటరుకు పైగా జనసందోహంతో నిండిపోయింది. ఆకాశ గంగ (కుళాయి)స్నానం ఆచరించారు. అనంతరం గోదావరి నది ఒడ్డున గల గౌతమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గోదావరి అవతలి వైపు (గోలివాడవైపు) నీరు ప్రవహించటంతో కిలోమీటర్లకు పైగా నడకతో ఇబ్బందులు పడ్డారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ లేక.. గోదావరిలో నీటి మట్టం తగ్గిపోవటం.. గోలివాడవైపు వెళ్లి స్నానం ఆచరించాల్సి వచ్చింది. భక్తులకు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్‌లు లేకపోవటంతో ఇబ్బందులు పడ్డారు. భక్తులకు కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పూరి, సిరా, అల్పాహారం, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. విశ్వనాథ ఆలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా సాగింది. దేవతామూర్తులను సన్నాయిమేళాల మధ్య పూలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపానికి తీసుకొచ్చి శివపార్వతుల కల్యాణం జరిపించారు. అనంతరం నిశీపూజ, స్వామివారికి బిల్వదళ సమర్పణ కార్యక్రమం నిర్వహించారు.



కల్యాణ మండపంలో దేవతామూర్తులు, అర్చకులు



గోదావరి నది ఒడ్డున...



హాజరైన భక్తులు



విశ్వనాథ ఆలయంలో...

దండేపల్లిలో భక్తుల రద్దీ



దండేపల్లి: ద్వారక గోదావరి నది తీరంలో భక్తుల పుణ్యస్నానాలు

దండేపల్లి: మండలంలోని గూడెం, ద్వారక గోదావరి నదీ తీరాలకు భక్తులు తరలి వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో నదీ తీరం భక్తులతో రద్దీగా కనిపించింది. ద్వారక నదిఒడ్డున గల గంగమ్మతల్లి, దత్తాత్రేయాస్వామి, మేదరిపేటల శ్రీ కాశివిశ్వేర స్వామి, నర్సాపూర్ శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జునస్వామి, లక్ష్మీకాంతపూర్ శ్రీ మల్లిఖార్జునస్వామి, గూడెం గోదావరినది ఒడ్డున గల శ్రీ మహాలింగేశ్వరస్వాములను దర్శించుకుని పూజలు చేశారు. బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిరా ప్రసాదం అందజేశారు. ఎస్సై తహసినొద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గూడెం శ్రీమహాలింగేశ్వరాలయంలో శివ భక్తుల పూజలు



గూడెం వద్ద గంగమ్మతల్లికి భక్తుల పూజలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

బెల్లంపల్లి/తాండూర్/దండేపల్లి/కాసిపేట/జన్నారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలు పాటించాలని అధికారులు సూచించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని, ఇందుకు సంబంధించి 200మీటర్ల దూరం వరకు ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. పోలింగ్ విజయవంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. బెల్లంపల్లిలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జోత్స్న, తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్, కాసిపేటలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, జన్నారంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎస్సై రాజవర్ధన్, ఎంఈవో విజయ్‌కుమార్, జోనల్ ఎన్నికల నిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు ఆయా మండల కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించారు.



దండేపల్లి: సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది